# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 16, అక్టోబరు, 2015

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం - చైనా కంపెనీల మధ్య శుక్రవారం రెండు కీలక ఎంఓయులు కుదిరాయి. తెలంగాణ రాష్ట్రంలో డ్రైపోర్ట్ ఏర్పాటు చేయడానికి, ప్రి ఫ్యాబ్ కాంక్రీట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ స్థాపించడానికి చైనా దేశానికి చెందిన అగ్రశ్రేణి సంస్థ సాని గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది. డ్రైపోర్ట్ ఏర్పాటు చేసే ఒప్పంద పత్రాలను తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి (ఇన్‌చార్జి) జయేష్ రంజన్, సాని హెవీ ఇండస్ట్రీ చైర్మన్ వెన్‌జెన్ (Wengen), పోర్ట్ లియాన్ యంగ్ గాంగ్ వైస్ ప్రెసిడెంట్ చున్‌హంగ్ (Chunhong) పరస్పరం మార్చుకున్నారు.

నిర్మాణాలకు ఉపయోగించే ప్రిఫ్యాబ్ కాంక్రీట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ స్థాపనకు సంబంధించిన ఒప్పంద పత్రాలను తెలంగాణ ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి దాన కిశోర్, సాని ఇంటర్నేషనల్ హౌజింగ్ జనరల్ మేనేజర్ హైజున్ డెంగ్ (Hainjun Deng) పరస్పరం మార్చుకున్నారు.

ఫలక్‌నుమా ప్యాలేస్‌లో శుక్రవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు - సాని గ్రూప్ నేతృత్వంలోని చైనా కంపెనీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, కె.తారకరామారావు, ఇంద్రకరణ్ రెడ్డి, ఈటెల రాజేందర్, జగదీష్‌రెడ్డి, అధికారులు ప్రదీప్‌చంద్ర, అనురాగ్‌శర్మ, దానకిశోర్, జయేష్‌రంజన్, ఎంజి.గోపాల్, ప్రభాకర్ రావు, శ్రీధర్, సోమేష్‌కుమార్, శాలినీమిశ్రా, నర్సింహరెడ్డి, శాంతికుమారి, జనార్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సివి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చైనా బృందంలో సాని గ్రూప్ చైర్మన్ లియాన్ వెన్‌జెన్, సాని (ఇండియా) డైరెక్టర్ జిగువో (Xiuguo), సిఇఒ డుయాన్ దావే (Duan Dawai), సిసిటిఇజి వైస్ ప్రెసిడెంట్ దీపక్ గార్గ్ (Deepak Garg), చైనా మిన్‌షెంగ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పోరేషన్ వైస్ ప్రెసిడెంట్

జాంగ్ కౌషు (Zhang Keshu), చైనా కోల్‌మైన్ కనస్ట్రక్షన్ గ్రూప్ కార్పోరేషన్ చైర్మన్ జియోజాంగ్ (Guogang), పోర్టు హోల్డింగ్ గ్రూప్ కంపెనీస్ వైస్ ప్రెసిడెంట్ చున్ హాంగ్ తదితర 45 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం, మిగులు విద్యుత్ ఉత్పత్తి కోసం చేస్తున్న ప్రయత్నాలు, డ్రైపోర్ట్ ఆవశ్యకతను, సింగరేణి కాలరీస్ ద్వారా జరిగే బొగ్గు ఉత్పతి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం, పట్టణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, హైదరాబాద్ నగరంలో రహదారులు, రవాణా వ్యవస్థ అభివృద్ధి, తదితర అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ, చైనా నుంచి ఎంతో ఆసక్తితో వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. "తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలున్నాయి. తెలంగాణలో మంచి పారిశ్రామిక విధానం ఉంది. అవినీతి రహిత పాలన ఉంది. పేదల ఆత్మగౌరవంతో బతికేలా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కడుతున్నాము. ఈ రంగంలో అవకాశాలున్నాయి. నేను చైనాకు వచ్చినప్పుడు మీరు ఎంతో ఆదరణ చూపారు. నా ఆహ్వానం మన్నించి ఇక్కడికి వచ్చారు. మీకు సాదర స్వాగతం. ఇక్కడ పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని సిఎం అన్నారు''.

---

**సిపిఆర్ఓ టు సిఎం**